
సాక్షి
పల్నాడు
సోమవారం । 29 । జూలై । 2024





## గ్రామ దేవతలకు బోనాలు

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల దేవాలయంలో ఆదివారం సారె, బోనాలు జరిపారు.



## సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1016 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు కెనాల్‌కు 338 క్యూసెక్కులు వదిలారు.

## ఐశ్వర్య ప్రదాయిని అలంకారంలో బండ్లమ్మ



చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఐశ్వర్య ప్రదాయినిగా అలంకరించారు. దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

## న్యూస్‌రీల్

### 31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాజరు కాకున్నప్పటికీ, స్పాట్ అడ్మిషన్ల కోసం ఇంటర్వ్యూకు హాజరు కావచ్చునని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కమర్షియల్, కంప్యూటర్ ప్రాక్టీసు, అప్పెరల్ డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలకు షెడ్యూల్ ప్రకటించినట్లు తెలిపారు. కళాశాలలో అందుబాటులో ఉన్న సీట్ల వివరాలను నోటీసుబోర్డులో ఉంచినట్లు పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థినులు టెన్త్ మార్కుల జాబితా, నాలుగో తరగతి నుంచి టెన్త్ వరకు స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, టీసీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఆరు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు ఒరిజినల్‌తో పాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో ఈనెల 31 ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ కోసం విద్యార్థినులు రూ.6,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

### తహసీల్దార్ కార్యాలయంలో చీఫ్ కమిషనర్ తనిఖీలు



ఫిరంగిపురం : ఫిరంగిపురం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆదివారం రాష్ట్ర భూపరిపాలన చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి, సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ శ్రీకేష్ బాలాజీరావు లత్కర్‌లు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం పైన రీ సర్వేకు సంబంధించి ఏర్పాటు చేసిన కార్స్ బేస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, పనిచేసే విధానం గురించి సర్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట గుంటూరు జిల్లా జేసీ ఎ.భార్గవ్‌తేజ, సర్వే సహాయసంచాలకుడు నాగసాయి, డిప్యూటీ తహసీల్దార్ రాజా రమేష్, సర్వేయర్లు ఉన్నారు.


### మైనార్టీ కళాశాలలో ప్రవేశాలకు 31 వరకు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరు నందివెలుగురోడ్డులోని ఏపీ రెసిడెన్షియల్ మైనార్టీ ఉర్దూ బాలుర జూనియర్ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు తుది గడువు ఈనెల 31న ముగియనుందని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శిరీష ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ గ్రూపులో రెండు, బైపీసీ గ్రూపులో 18, సీఈసీ గ్రూపులో 20 సీట్లు చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. గత మార్చిలో జరిగిన టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులే అర్హులని, ఆసక్తిగల విద్యార్థులు సామాజికవర్గ ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు కళాశాలలో నేరుగాను, 87126 25073, 98495 59611 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

### నేడు జిల్లా చదరంగ పోటీలు ప్రారంభం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా బాల, బాలికల చదరంగం పోటీలు సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక అంజనేయపేట 2వ లైన్‌లోని విజేత ఐటీ ఫౌండేషన్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఆదివారం నైట్స్ కాస్టల్ చెస్ అకాడమీ డైరెక్టర్ వై.వి.కె.చక్రవర్తి ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు 2017 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కానున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు సోమవారం ఉదయం 9 గంటలకు జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కాగలరని తెలిపారు. ఇతర వివరాలకు 891998384, 7981664035 నంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

### సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 510.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 5,944, ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

# వ్యాఘ్రరాజానికి అభయం

## పెద్దపులుల ఆవాసంగా నల్లమల అభయారణ్యం

ఉట్టిపడే రాజసం.. ఒళ్లంతా పౌరుషం.. సింహానికి తీసిపోని దర్పం.. సాటిలేని సొగసు.. నడకలో ఠీవి.. వేటలో దానికదే సాటి.. పంజా విసిరితే ఎంతటి ప్రత్యర్థి అయినా మట్టికరవాల్సిందే.. అదే పెద్దపులి. రాజసం, దర్పం, ఠీవి దాని నడకలో కనిపిస్తుంది. మనిషి క్రూరత్వానికి బలవుతూ తన ఉనికిని కోల్పోతూ, భూమిపై అంతరించిపోతున్న జంతుజాతుల జాబితాలో పులి పేరు చేరటం అత్యంత బాధాకరమైన విషయం. పర్యావరణ సమతుల్యతకు దోహదపడే పులిని సంరక్షించటం అందరి బాధ్యత. నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..



నల్లమల అడవిలో తిరుగాడుతున్న పెద్దపులి (ఫైల్)

- జిల్లాలో 1.5 లక్షల హెక్టార్ల అటవీ భూమి
- విజయపురి సౌత్ రేంజ్‌లో ఐదు పెద్దపులులు
- పులుల సంరక్షణకు అటవీ శాఖ పటిష్ట చర్యలు
- కృష్ణాతీరం వెంట 50కి.మీ మేర పెట్రోలింగ్
- నీటి కుంటలు ఏర్పాటు
- లెక్క పక్కాగా తేల్చేలా ట్రాప్ కెమెరాల ఏర్పాటు
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

నరసరావుపేట ఈస్ట్: నల్లమల.. పులుల ఆవాస కేంద్రం. రాష్ట్రంలోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కర్నూలు, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలలో దాదాపు 10 లక్షల ఎకరాలలో విస్తరించి ఉన్న నల్లమల అటవీ ప్రాంతం పెద్దపులుల నివాస స్థలం. పులుల సంరక్షణ కోసం ప్రభుత్వం ఎన్నో రక్షణ చర్యలు చేపట్టింది. నల్లమల అటవీ ప్రాంతంలో దాదాపు 3,568 చదరపు కిలోమీటర్ల పరిధిలో నాగార్జునసాగర్–శ్రీశైలం పులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్) ఉంది. పల్నాడుజిల్లా పరిధిలో 1.5లక్షల హెక్టార్‌లలో అటవీ భూమి ఉంది. దీనిలో విజయపురిసౌత్ రేంజ్ ఎన్ఎస్‌టీఆర్ పరిధిలోకి వస్తుంది. పులుల సంరక్షణకు అటవీశాఖ పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టింది.

**జిల్లాలో పులి సంచార ప్రాంతాలు...**

విజయపురిసౌత్ రేంజ్ ఎన్ఎస్‌టీఆర్ అటవీ ప్రాంతాన్ని మినహాయిస్తే పల్నాడు జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతంలో 3 బేస్ క్యాంపులను ఏర్పాటు చేశారు. మాచర్ల, వినుకొండ, పిడుగురాళ్లలో ఈ బేస్ క్యాంపులు పనిచేస్తాయి. ఒక్కో బేస్ క్యాంప్‌లో ఐదుగురు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ప్రతిరోజూ తమ క్యాంప్ పరిధిలో 10 నుంచి 15 కిలో మీటర్లు నడక ద్వారా అడవిలోని వన్యప్రాణుల సంచారాన్ని గమనిస్తుంటారు.విజయపురిసౌత్ రేంజ్ అటవీ ప్రాంతంలో తొమ్మిది బీట్లు ఉండగా వీటిలో శిరిగిరిపాడు, బోయపాడు, బటుకులపాయ, వరికపూడిశెల, పసువులరేవు 5 బీట్లులో పెద్దపులి నిరంతర సంచారాన్ని అధికారులు గుర్తించారు. అలాగే పల్నాడు జిల్లా పరిధిలో బోయపల్లి, కాకిరాల, బొల్లాపల్లి, అడిగొప్పల, వెల్దుర్తి బీట్‌లలో పులి సంచారం ఉన్నట్టుగా అటవీశాఖ అధికారులు ధ్రువీకరిస్తున్నారు. పల్నాడుజిల్లా పరిధిలోకి వచ్చే మార్కాపురం ఫారెస్ట్ డివిజన్‌లోని విజయపురి సౌత్ రేంజ్‌లో ఐదు పెద్దపులులు సంచరిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. గతంలో పులుల సంచారం లేని ఈప్రాంతంలో నేడు అటవీశాఖ తీసుకున్న చర్యలు కారణంగా పులుల సంచారం కనిపిస్తుంది.

**నిరంతర నిఘా...**

అంతరించిపోతున్న జంతుజాలం జాబితాలో చేరి రెడ్ డాటా బుక్‌లో పేరు నమోదైన పెద్దపులిని సంరక్షించేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. పర్యావరణ అభివృద్ధిలో పులికి పెద్దపీట వేస్తూ దానికి అనుకూల వాతావరణాన్ని కల్పించటం, అడవుల్లో మనుషుల సంచారాన్ని నిషేధించటం, పులి ఆహార జంతుజాలం పెరిగేందుకు గడ్డి మైదానాలను పెంచటం, నిరంతర నిఘా వంటి కార్యక్రమాలతో పులుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకొంది.

- పులుల సంరక్షణ కోసం అటవీశాఖ బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేసింది. పల్నాడు డివిజన్ పరిధిలో మాచర్ల, వినుకొండ, పిడుగురాళ్లలో బేస్ క్యాంప్‌లు ఉండగా మార్కాపురం డివిజన్ కింద పల్నాడుజిల్లా పరిధిలోని విజయపురి సౌత్ రేంజ్‌లో తొమ్మిది బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేసింది.
- అడవి జంతువులను వేటగాళ్ల నుంచి కాపాడేందుకు యాంటీ కోచింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. దీని కోసం ప్రతి స్క్వాడ్‌లో నలుగురు ట్రైబల్స్‌ను సహాయకులుగా నియమించుకొని వన్యప్రాణుల సంరక్షణను చేపడుతున్నారు. దీనిలోని వారు అటవీ ప్రాంతంలో పాటు సమీప గ్రామాలలో పర్యటిస్తూ వన్యప్రాణులను హతమార్చేందుకు ఉచ్చులు, విద్యుత్ తీగలను ఎవరైనా ఏర్పాటు చేస్తే వాటిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటారు.

**సంరక్షణ చర్యలు**

పులులను సంరక్షించేందుకు అటవీశాఖ అధికారులు ఎన్నో సంరక్షణా చర్యలను చేపట్టింది. వేసవి కాలంలో నీటి ఎద్దడిని నివారించేందుకు అటవీ ప్రాంతంలో సాసర్ పిట్స్ ( సిమెంట్ నీటి గుంటలు)ను ఏర్పాటు చేసింది. అటవీ సమీప గ్రామాలలోని పశువులపై పులి దాడి చేసిన సందర్భాలలో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించేందుకు అటవీశాఖ ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసుకుంది. తద్వారా ప్రజల్లో పులులకు వ్యతిరేకంగా ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు వీలవుతుంది. పర్యావరణ సమతుల్యతలో పులి అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుంది. అడవిలో పులి తన ఆహారం కోసం జింకలు వంటి వన్యప్రాణులను స్వీకరించటం ద్వారా శాఖాహార వన్య ప్రాణుల సంఖ్య సమతుల్యంగా ఉంటుంది. లేని పక్షంలో వాటి సంఖ్య విపరీతంగా పెరిగి అడవి, అడవితో పాటు సమీప గ్రామాలలోని పంట పొలాలను నాశనం చేసే ప్రమాదం ఉంది.

### కెమెరా ట్రాప్‌లు... లెక్క పక్కా



పెద్దపులుల లెక్క పక్కాగా తేల్చేందుకు గతంలో వాటి పాదముద్రలను సేకరించి విశ్లేషించటం ద్వారా పులుల సంఖ్యను లెక్కగట్టేవారు. దీనినే స్టాండర్డ్ పగ్‌మార్క్ ఎన్యూమరేషన్ అని పిలిచేవారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నేడు ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలను వినియోగిస్తున్నారు. చిన్నపాటి ఆకు కదిలికలను సైతం ఈ కెమెరాలు తమలో నిక్షిప్తం చేసుకుంటాయి. అడవిలో వన్యప్రాణులు సంచరించే ప్రాంతాలలో జీవాలను రెండు పక్కలా ఫొటోలు తీసేలా వీటిని అమరుస్తారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వీటి విశ్లేషణ జరుగుతుంది. విశ్లేషణ ఆధారంగా ప్రతి పులికి ఒక ఐడీ కేటాయిస్తారు.

### ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటున్నాం..



నల్లమలలో భాగమైన విజయపురి సౌత్ రేంజ్ పరిధిలో పులుల సంచారం కన్పిస్తోంది. గత పది సంవత్సరాలలో లేని విధంగా ఈప్రాంతంలో పులులు సంచరిస్తుండటంతో వాటి రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఫుట్ పెట్రోలింగ్, రివర్ పెట్రోలింగ్‌ను పెంచటంతో పాటు పులి సంచారానికి అవరోధం కలగకుండా సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశాం. ప్రస్తుతం పులుల మేటింగ్ అనుకూల కాలం కావటంతో అడవిలో జన సంచారాన్ని నిషేధించాం. పులుల సంతతి పెరిగేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నాం.

– తమ్మినేని సత్యనారాయణ, రేంజ్ ఆఫీసర్, విజయపురి సౌత్

### పులుల సంరక్షణ ఎంతో అవసరం...



పర్యావరణ పరిరక్షణలో పెద్దపులిది అతి ప్రధానమైన పాత్ర. పులిని సంరక్షించుకునేందుకు తీసుకునే ప్రతి చర్య పర్యావరణ సమతుల్యతకు ఉపకరిస్తుంది. పల్నాడు జిల్లా పరిధిలో పెద్దపులి సంచారం కనిపిస్తోంది. పులి ఆవాసం, ఆహారం, నీటి వసతి తదితర సంరక్షణ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం.

– ఎస్.రామచంద్రరావు, జిల్లా అటవీశాఖాధికారి, పల్నాడుజిల్లా

# కాటేసిన కర్కశ క్షణం

- రెప్పపాటులో ప్రమాదం
- దైవదర్శనానికి వెళ్తుండగా ట్రాక్టర్ బోల్తా
- ముగ్గురు దుర్మరణం.. 11 మందికి గాయాలు
- ఎదురుగా వస్తున్న బస్సును తప్పించే క్రమంలో దుర్ఘటన



ప్రమాద స్థలంలో పడి ఉన్న మృతదేహాల వద్ద రోధిస్తున్న బంధువులు







ప్రమాదంలో మరణించిన శివనాగులు, కోటేశ్వరరావు, లక్ష్మి (ఫైల్)

నగరం/కర్లపాలెం(పిట్టలవానిపాలెం): విరిసిన నవ్వులు అంతలోనే అశ్రుధారలై పొంగాయి. కబుర్లతో కొట్టిన కేరింతలు రెప్పపాటులో హాహాకారాలుగా మారాయి. ఆనందంగా సాగుతున్న ప్రయాణంలో ఒక్క కుదుపు.. అదుపు చేయలేని వేదనను మిగిల్చింది. మృత్యువు విసిరిన కర్కశ క్షణం మూడు ప్రాణాలను బలితీసుకుంది. 11 మందిని క్షతగాత్రులను చేసింది. 14 కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది. ఈ హృదయ విదారక ఘటన ఆదివారం దమ్మనవారిపాలెం రహదారిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నగరం మండలం గట్టువారిపాలెం గ్రామానికి చెందిన సుమారు 20 మంది కాకుమాను మండలం కొండపాటూరులోని పోలేరమ్మ దర్శనానికి ఆదివారం ఉదయం ట్రాక్టర్‌లో బయలు దేరారు. ముచ్చట్లు చెప్పుకుంటూ తుళ్లింతలు, కేరింతలతో సాగుతున్న ప్రయాణం.. కర్లపాలెం మండలం యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో దమ్మన్నవారిపాలెం రహదారిలోకి వచ్చేసరికి రెప్పపాటులో విషాదాంతమైంది. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న పంటపొలాల్లో బోల్తా కొట్టింది. ట్రాక్టర్ ట్రక్కులో ఉన్న గట్టు కోటేశ్వరరావు (65) గడ్డం శివనాగులు (56), గడ్డం లక్ష్మి (40) అక్కడిక్కడే దుర్మరణం పాలయ్యారు. 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

**గట్టువారిపాలెంలో విషాద ఛాయలు**

దుర్ఘటనతో గట్టువారిపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి మొక్కుబడులు చెల్లించుకునేందుకు గ్రామానికి చెందిన 20 మందితో కొండపాటూరు వెళ్తుండగా ప్రమాదం జరగడంతో గ్రామస్తులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. ముగ్గురు మరణించారని తెలిసి కన్నీరుమున్నీరయ్యారు.

**వ్యవసాయ కుటుంబాలకు తీరని వేదన**

ప్రమాదంలో మరణించిన గట్టు కోటేశ్వరరావు, గడ్డం శివనాగులు, గడ్డం లక్ష్మి ముగ్గురూ వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారే. గట్టు కోటేశ్వరావుకు భార్య లక్ష్మి, కమార్తె, కుమారుడు ఉన్నారు. పిల్లలిద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. గడ్డం శివనాగులుకు భర్త సాంబశివరావు, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈమె పిల్లలకూ వివాహాలయ్యాయి. గడ్డం లక్ష్మికి భర్త రాజబాబు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాద వార్త తెలియగానే ఈ మూడు కుటుంబాల వారు కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాదం విషయం తెలుసుకున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, రూరల్ సీఐ హజరత్ బాబు, కర్లపాలెం ఇన్‌చార్జ్ ఎస్ఐ అనిల్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను ఎమ్మెల్యేతోపాటు జాయింట్ కలెక్టర్ సుబ్బారావు పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**మానవత్వం చాటిన స్థానికులు**

దుర్ఘటన జరిగిన వెంటనే యాజలి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల సమీపంలో ఉండే స్థానికులు మానవత్వం చూపారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. పంక్చర్ షాపు నిర్వాహకుడు వేము చిన ప్రసాద్ తన స్నేహితులతో కలిసి తన వద్ద గల ఎయిర్ జాకీ సహాయంతో బోల్తా పడిన ట్రక్కును పైకి లేపి కింద చిక్కుకున్న వారిని బయటకు లాగారు. ప్రసాద్ వెంటనే స్పందించకపోతే మరింతమంది ప్రాణాలు కోల్పోయేవారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

## ఉమ్మడి ఏపీ అభివృద్ధికి కేబీఆర్ విశేష కృషి

- ఘనంగా మాజీ సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి జయంతి
- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



నరసరావుపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి, దివంగత కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) ఎనలేని కృషి చేశారని ఆయన మనవడు, గురజాల మాజీ శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కేబీఆర్ 115వ జయంతిని పురస్కరించుకొని నరసరావుపేట పల్నాడురోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, కేంద్ర హోం మంత్రితో పాటు అనేక కేంద్ర మంత్రి పదవులు, రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, మహారాష్ట్ర గవర్నర్‌గా పదవులు చేపట్టి ఆ పదవులకే కాసు బ్రహ్మానందరెడ్డి వన్నె తెచ్చారన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు క్రస్ట్‌గేట్లు పెట్టించి కృష్ణా నీటిని పరవళ్లు తొక్కించి ఎంతో వెనుకబడిన పల్నాడు ప్రాంతాన్ని సుభిక్షం చేశారన్నారు. సజ్జ, జొన్న పండే పరిస్థితి నుంచి వరి, వాణిజ్య పంటలైన పత్తి, మిరప పండించే స్థాయికి రైతులను తీసుకెళ్లారన్నారు. వైజాగ్ స్టీలు ప్లాంట్‌తో పాటు హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్, ఐడీపీఎల్, ఐడీఎస్ఎంటీ లాంటి అనేక భారీ పరిశ్రమలు పెట్టించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ఎల్ఐసీ నుంచి రుణం తీసుకొని తొలిసారిగా రాష్ట్రంలో పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టారన్నారు. హైదరాబాదులోని జూబ్లీహిల్స్ లాంటి కాలనీ సొసైటీలు ఏర్పాటు చేశారన్నారు. పోచంపాడు, శ్రీశైలం లాంటి ప్రాజెక్ట్‌లకు నాంది పలికారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వర్‌రెడ్డి, షేక్ ఫరీద్, యన్నం పాపిరెడ్డి, ఎస్‌కేఆర్‌బీఆర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



# దవాఖానాలో ఘర్షణ

### డాక్టర్ వర్సెస్ వైద్య సిబ్బంది వార్

- ఏడు నెలలుగా వేటపాలెం వైద్యశాలలో గొడవలు
- మహిళా ఉద్యోగులను వేధిస్తున్నారని ర్యాలీ, ధర్నాలు
- డీఎంహెచ్‌ఓకు సిబ్బంది ఫిర్యాదు
- పోలీసుస్టేషన్‌కు చేరిన పంచాయితీ
- పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు



ఫార్మసిస్ట్ తనను కొట్టాడని డీఎంహెచ్‌ఓకి ఫిర్యాదు చేస్తున్న డాక్టర్ బాలరాజు

వేటపాలెం: ఆయనో ప్రభుత్వ వైద్యుడు. పీహెచ్‌సీలో అందరికీ ఆదర్శంగా నిలవాల్సిన ఆయన సిబ్బందితో గొడవలు పెట్టుకుంటూ నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. ఇష్టం వచ్చినట్లు సిబ్బందిని దూషిస్తూ చిత్రవిచిత్రంగా ప్రవర్తిస్తున్నాడు. చాలాసార్లు రోగులూ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ విషయమై జిల్లా వైద్యాధికారికి సిబ్బంది చాలాసార్లు ఫిర్యాదు చేశారు. నాలుగుసార్లు ఉన్నతాధికారులు విచారణ చేపట్టినా పరిస్థితి సర్దుమణగలేదు.

**ఫార్మసిస్ట్‌పై ఫిర్యాదు..**

పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ బాలరాజు అక్కడ పనిచేస్తున్న ఫార్మసిస్ట్ జీఎస్ వెంకట ప్రసాద్‌కు మధ్య తాజాగా ఘర్షణ జరిగింది. దీనిపై డీఎంహెచ్‌ఓకు, వేటపాలెం పోలీసులకు డాక్టర్ ఫిర్యాదు చేశారు. పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు విధులు నిర్వహిస్తుండగా ప్రధాన వైద్యాధికారి అనారోగ్యంతో సెలవుపై ఉన్నారు. ప్రస్తుతం ఉన్న బాలరాజు కూడా వివాదాస్పదం కావడంతో రోగులకు సరిగా సేవలు అందడం లేదు. దీంతో రోగులు పీహెచ్‌సీకి రావడం లేదు. గతంలో రోజుకు 70 నుంచి 100 వరకు రోగులు వచ్చేవారు. ప్రస్తుతం ఓపీ 30కి పడిపోయింది.

**వైద్యుడి వేధింపులపై సిబ్బంది ధర్నాలు**

డాక్టర్ బాలరాజు వేధిస్తున్నాడని ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో మహిళా సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు దాదాపు 70 మంది నిరసన ర్యాలీ, ధర్నాలు నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌ఓకు మహిళా సిబ్బంది ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. విచారణతో డీఎంహెచ్‌ఓ చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా డాక్టర్, సిబ్బంది మధ్య సఖ్యత కుదిర్చి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### పనిచేయమంటే వ్యతిరేకిస్తున్నారు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని సూచనలు ఇస్తే నన్ను వ్యతిరేకిస్తున్నారు. సిబ్బంది అందరూ నాపై అసత్య ఆరోపణలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలు పాటించమనడం తప్పుగా భావిస్తున్నారు.

– డాక్టర్ బాలరాజు, వేటపాలెం, పీహెచ్‌సీ

### చర్యలు తీసుకుంటాం..

వేటపాలెం పీహెచ్‌సీలో దాదాపు ఏడు నెలలుగా సిబ్బందికి, డాక్టర్‌కు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంపై నాకు ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమే. అయితే ఇరుపక్షాలు సర్దుకుపోతాయని భావించాం. ఇప్పుడు పరిస్థితి తీవ్రంగా మారింది. సోమవారం విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– విజయమ్మ, డీఎంహెచ్‌ఓ, బాపట్ల

## క్లుప్తంగా

### ధరణికోటలో శతాధిక వృద్ధుడు మృతి


మోపిదేవి సత్యనారాయణ(ఫైల్)

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు మోపిదేవి సత్యనారాయణ(105) ఆదివారం మరణించాడు. బ్రిటిష్ కాలం నుంచి కాలువలపై లస్కర్‌గా సత్యనారాయణ పనిచేశాడు. ఆనాటి నుంచి నేటివరకు ప్రభుత్వం నుంచి పింఛన్ అందుకోవటం విశేషం. కొద్దినెలల క్రితం 99 సంవత్సరాల వయస్సు కల్గిన ఈయన భార్య మరణించటం జరిగింది. సత్యనారాయణ మృతదేహానికి బంధువులు, గ్రామస్తులు నివాళులు అర్పించారు.

### అప్పల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య


వీరవసంతరావు మృతదేహం

సత్తెనపల్లి: అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నందిగామ గ్రామానికి చెందిన పోలినేని వీరవసంతరావు (38) గత ఏడాది 5 ఎకరాలు పత్తి, 5 ఎకరాలు మిర్చి పంటలు సాగు చేశాడు. వర్షాలు సకాలంలో కురవకపోవడం, మిర్చికి తెగుళ్ల రావడంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఈ క్రమంలో భూ యజమానులకు కౌలు చెల్లించే పరిస్థితి లేకపోవడం, మరోవైపు చేసిన అప్పులు తీరే మార్గం కనిపించకపోవడంతో శనివారం రాత్రి మద్యం, శీతల పానీయంలో నువక్రాన్ పురుగుమందు కలుపుకొని ఇంట్లో సేవించి ఆత్మహత్యకుయత్నించాడు. వెంటవెంటనే వాంతులు చేసుకోవడంతో భార్య లక్ష్మీ తిరుపతమ్మ, చిన్నమ్మలు ప్రశ్నించగా పురుగుమందు సేవించినట్లు చెప్పటంతో హుటాహుటిన సత్తెనపల్లి వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ వీరవసంతరావు మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీ తిరుపతమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. సుమారు రూ. 7 లక్షల వరకు అప్పులు ఉన్నట్లు అంచనా. వీరవసంతరావు మృత దేహానికి సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి మృతుడి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని పోలీసులు అప్పగించారు. సత్తెనపల్లి రూరల్ ఏఎస్‌ఐ కరీముల్లా రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆదివారం తెలిపారు.

# అంబరాన్నంటిన సారె సంబరం

**ఆదివారం రికార్డు స్థాయిలో దుర్గమ్మకు సారె సమర్పణ**


క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు


పూజలందుకుంటున్న అమ్మవారు


సారెతో ఆలయానికి వచ్చిన పోలీసు కమిషనర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సారె సంబరం అంబరాన్ని తాకింది. ఆదివారం రికార్డు స్థాయిలో వందకు పైగా భక్త బృందాలు అమ్మవారికి సారెను సమర్పించాయి. ఉదయం నుంచి కొనసాగిన భక్తుల రద్దీ 11 గంటల తర్వాత మరింత అధికమైంది. ఘాట్‌రోడ్డు మీదుగా భక్తులను కొండపైకి అనుమతించడంతో ఓం టర్నింగ్ వరకు క్యూలైన్లు కిటకిటలాడాయి. మరో వైపున మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గంలో కొండపైకి చేరుకుంటున్న భక్తులతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. దీంతో మహా మండపం నాల్గో అంతస్తు వరకు భక్తుల రద్దీ కనిపించింది. భక్తుల రద్దీ అధికం కావడంతో మహా మండపం లిఫ్టులను 5వ అంతస్తు వరకే అనుమతించారు. ఉదయం 11.40 గంటల నుంచి మధ్యాహ్నం 12.10 గంటల వరకు అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కేఎస్ రామరావు ఆలయంలో క్యూలైన్లను పర్యవేక్షించారు. అమ్మవారికి సారెను తీసుకువచ్చిన భక్తులను రూ. 300, రూ.100 దర్శన క్యూలైన్లతో పాటు ముఖ మండప దర్శనానికి అనుమతించారు. దీంతో మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. దేవస్థాన ఇంజినీరింగ్, పరిపాలనా విభాగానికి చెందిన ఉద్యోగులకు చిన్న గాలిగోపురం, స్కానింగ్ పాయింట్లలో ప్రత్యేకంగా విధులు కేటాయించారు. సారె సమర్పించిన అనంతరం భక్త బృందాలు ఆలయ ప్రాంగణంలో సేదదీరి, ప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం భక్తుల రద్దీ కొనసాగింది.

**పోలీసు శాఖ తరఫున దుర్గమ్మకు సారె**

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు నగర పోలీసు శాఖ తరఫున ఆదివారం ఆషాఢ సారెను సమర్పించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు దంపతులు, ఇతర పోలీసు అధికారులు కుటుంబ సమేతంగా అమ్మవారికి సారె సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా సారెతో ఆలయానికి చేరుకున్న పోలీసు అధికారులను దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం పోలీసు శాఖ తరఫున పట్టుచీర, పూజా సామగ్రి, పసుపు, కుంకుమను ఆలయ అర్చకులకు అందజేశారు. వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఈవో రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. అమ్మవారికి సారె సమర్పించిన వారిలో డీసీపీలు గౌతమీ శాలి, ఉదయరాణి, హరికృష్ణ, వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి, వన్‌టౌన్ సీఐ దుర్గశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక లారీలు, ట్రాక్టర్లు స్వాధీనం



అచ్చంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఇసుక లారీలు, ట్రాక్టర్లు

అచ్చంపేట: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీలను, ట్రాక్టర్లను మండలంలోని వేల్పూరు - క్రోసూరు గ్రామాల మధ్య మైనింగ్, పోలీస్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎలాంటి అనుమతులు లేకుండా మండలంలోని కొత్తపల్లి డంపింగ్ పాయింట్ నుంచి ఇసుకను సత్తెనపల్లి వైపు తరలిస్తున్న మూడు 12 టైర్ల లారీలు, మూడు ట్రాక్టర్లను వేల్పూరు-క్రోసూరు గ్రామాలమధ్య మైనింగ్, పోలీస్ అధికారులు అడ్డగించారు. లారీ డ్రైవర్ల వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో అచ్చంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఒక పొక్లెయిన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# రాష్ట్ర మరాఠా సంఘం నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన సంఘం నేతలు

గుంటూరు మెడికల్: రాష్ట్ర మరాఠాల ఆత్మీయ సమావేశం ఆదివారం గుంటూరు లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ సమీపంలోని సీతారామాంజనేయ స్వామి దేవస్థాన కమిటీ హాలులో నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర సంఘాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గంగాధర్ రావు తెన్నేటి, గౌరవ సలహాదారుడిగా డుమనే వెంకటేశ్వరరావు, ప్రెసిడెంట్‌గా మరాఠ వెంకట సోమాజి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిందే రవిచంద్రరావును ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్లుగా కదం శ్రీనివాసరావు, జాజం రాంభూపాలరావు, మోతే రామ్మోహనరావు, జనరల్ సెక్రటరీగా జాదవ్ ఎల్లోజి, సెక్రటరీగా హరినాథరావు జాదవ్, జాయింట్ సెక్రెటరీగా మోర శంకరరావు, , ట్రెజరర్‌గా కృష్ణ జాజమ్, పీఆర్వోగా పులహరి ఫిరోజి, ఎక్జిక్యూటివ్ మెంబర్స్‌గా అంబోరు కోటేశ్వరరావు, అన్నారావు పవార్, సిరసాటి సుదర్శనరావు, దున్నే శ్రీకాంత్, గాయకోటి వెంకటేశ్వరరావు, అశోక్ తెన్నేటి, ఘటకాల లింగోజి, లటికే మణికంఠను ఎన్నుకున్నారు.

# పేటలో కేబుల్ రగడ

- కేబుల్‌పై ఆధిపత్యం కోసం టీడీపీలో రెండువర్గాల పోరు
- కేబుల్ వైర్లు ధ్వంసం
- ఒకరిపై ఒకరు పరస్పర ఫిర్యాదులు
- టీడీపీకి చెందిన రెండు వర్గాలపై కేసు నమోదు

నరసరావుపేటటౌన్: కేబుల్ వైర్లు కట్ చేసిన ఘటనలో తెలుగుదేశం పార్టీలోని రెండు వర్గాలపై ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లపాటి కేబుల్ విజన్ నెట్‌వర్క్ వైర్లను శుక్రవారం కే చానల్ నెట్‌వర్క్‌కు సంబంధించిన జి.నరసింహారావు, మస్తాన్‌వలి, డేవిడ్, కోటిరెడ్డి, కిషోర్‌బాబు, రాజేష్, జగదీష్‌లు అరండల్‌పేటలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద కట్ చేశారు. ప్రశ్నించిన తనపై దౌర్జన్యం చేయటంతోపాటు దాడికి పాల్పడ్డారని నల్లపాటి కేబుల్ ప్రతినిధి దరువూరి బాబు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. అదేవిధంగా తమ సిబ్బంది రాజేష్, జగదీష్, కిశోర్‌లు అరండల్ పేటలో కేబుల్ బాక్సు సెట్ చేస్తుండగా ఎన్‌సీవీకి చెందిన లాం కోటేశ్వరరావు, దరువూరి బాబు, పానుగోటి వీరయ్య, గడిపూడి అశోక్, కల్లూరి రామకృష్ణ వచ్చి కులం పేరుతో దూషించి బలవంతంగా కిడ్నాప్ చేశారని ప్రత్యర్థి చానల్ ప్రతినిధి గున్నపనేని నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదుతో మరో కేసు నమోదు చేశారు.

# నేడు పాఠశాలల్లో తిథి భోజనం

- శిక్షా సప్తాహ్‌లో భాగంగా చివరిరోజు సహపంక్తి భోజనాలు
- పాఠశాలల్లో ప్రత్యేక వంటకాలు, స్వీట్లు, పండ్లు
- పిల్లలతో పాటే టీచర్స్, పేరెంట్స్, గ్రామపెద్దలకు సైతం..
- దాతల సాయం...అందకుంటే గురువుపైనే భారం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు(ఫైల్)

యడ్లపాడు: శిక్షా సప్తాహ్ చివరిరోజు కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తిథి భోజనాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం(ఎన్ఎస్ఏపీ) -2020 నాలుగేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు సంయుక్తంగా 'శిక్షా సప్తాహ్' పేరిటా రోజుకో కార్యక్రమం చొప్పున వారం రోజుల పాటు మార్గదర్శకాలను రూపొందించడం జరిగింది. వీటిని ఈనెల 22వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేశారు. స్థానిక వనరులతో బోధన సామగ్రి తయారు, విద్యార్థుల్లో క్రీడానైపుణ్యాలు పెంపు, పర్యావరణ సంరక్షణపై అవగాహన, సాంస్కృతిక అంశాలవైపు ఆకర్షించేలా కార్యక్రమాలు ఇలా ప్రతిరోజు ప్రత్యేకతను చాటుతూ వారంరోజులు పాటు నిర్వహించిన శిక్షణ సోమవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం చివరి రోజున విధిగా తిథి భోజనాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రణాళిక చేసింది. ప్రస్తుతం అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకం యథావిధిగా పాఠశాలల్లో అమలవుతుంది. వీటితో పాటు ప్రత్యేకంగా విద్యార్థులకు చికెన్ కర్రీ, బిరియానీ, పులిహోరా, రకరకాల స్వీట్లు, పండ్లు ఇలా దాతల సహకారంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, గ్రామపెద్దలకు సైతం ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ఆహార పదార్థాలను సమకూర్చేందుకు ఉపాధ్యాయులు దాతల సహాయం కోసం ఆదివారం సెలవుదినం రోజున బృందాలుగా కలిసి తిరిగారు. చాలాచోట్ల దాతలు ముందుకు రాకపోవడంతో ఉపాధ్యాయులే తమ సొంత డబ్బులతో ఈ సహపంక్తి భోజనాలు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

**పల్నాడు జిల్లాలో...**

ఏపీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1,162, ప్రాథమికోన్నత 148, ఉన్నత పాఠశాలలు 252 ఉన్నాయి. ఈ ఏడాది ప్రాథమిక పాఠశాలల్లో 54,844మంది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 14,416మంది, ఉన్నత పాఠశాలల్లో 83,919మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 1,562 పాఠశాలల్లో 1,53,179మంది విద్యార్థులు ఉన్నారు.

**పండుగ వాతావరణంలో సహపంక్తి భోజనం**

శిక్షా సప్తాహ్ కార్యక్రమం ముగింపు సందర్భంగా అన్ని పాఠశాలల్లో తిథి భోజనాలు ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, గ్రామపెద్దలు సైతం సహపంక్తి భోజనాలు చేస్తారు. సహపంక్తి భోజనాల సమయంలో పేరెంట్స్, గ్రామపెద్దలకు పాఠశాలలోని విషయాలు తెలుస్తాయి. ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించాం.

– వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి, పల్నాడు



# అథ్లెటిక్స్‌లో 'కేంద్రీయ' విద్యార్థుల సత్తా

**3కే వాక్‌లో గోల్డ్.. ఖోఖో, పరుగుపందెంలో కాంస్య పతకాలు**


పరుగుపందెంలో కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులు


ఖోఖోలో కాంస్యం సాధించిన జాగృతి


గోల్డ్ మెడల్ సాధించిన కె.దీపిక

నాదెండ్ల: కేంద్రీయ విద్యాలయం (ఇర్లపాడు) విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించారు. హైదరాబాద్, విశాఖపట్నంలలో జరిగిన రీజనల్ లెవల్ అథ్లెటిక్స్ మీట్ 2024-25లో కేంద్రీయ విద్యాలయం (ఇర్లపాడు) విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నెల 27న హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో 3 కేఎం వాక్‌లో పదో తరగతి చదువుతున్న కె.దీపిక గోల్డ్ మెడల్ సాధించింది. విశాఖపట్నంలో జరిగిన ఖోఖో పోటీల్లో 9వ తరగతి చదువుతున్న జాగృతి కాంస్య పతకం దక్కించుకుంది. అండర్ -14లో పరుగు పందెంలో కెల్లంపల్లి భరత్, ప్రవీణ్, యోగేష్, షేక్ అహమ్మద్ ఫుజైల్‌లు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గణపవరం సీఆర్ కళాశాల ఆవరణలోని కేంద్రీయ విద్యాలయంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ షేక్ ఫరూక్ అహమ్మద్ గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

# తైక్వాండోలో బంగారు పతకాలు


పతకాలు, సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులతో కోచ్ శ్రీనివాసరావు

తెనాలి రూరల్: రేపల్లెలోని బౌద్ధ ధర్మ అకాడమీలో ఈ నెల 19, 20 తేదీల్లో జరిగిన తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో తెనాలి బోస్ రోడ్డులోని కేఎస్ఆర్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. కాడి విభాగంలో రావిపాటి దివీజ్ మహిధర్, తుల్లిమిల్లి సత్యజస్వంత్, ఆరాధ్యుల నాగచరణ్, కె. హారిక వర్మ, సబ్ జూనియర్ విభాగంలో కె. సోమశేఖర్, కె. జానకీరామ్, కె. కార్తికేయరెడ్డి, పి. కృషిక ఆరాధ్య, పి. కృతిక ఆరాధ్య, ఒ. షణ్ముఖ అభిరామ్ బంగారు పతకాలు సాధించారు. వీరితో పాటు మరో 10 మంది రజత, కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థుల్ని కోచ్ శ్రీనివాసరావు ఆదివారం అభినందించారు. పలువురు ఉత్తరప్రదేశ్‌లో ఆగస్టు 16,17 తేదీల్లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

# వైఎస్సార్ సీపీ నేత కారును దహనం చేసేందుకు యత్నం


కారు చక్రానికి నిప్పు పెట్టిన దుండగులు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా కార్యదర్శి, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ మాజీ సభ్యుడు సయ్యద్ ఖాజా కారుపై పెట్రోల్ పోసి దహనం చేసేందుకు యత్నించిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని 28వ వార్డులో శనివారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ ఖాజా గతంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. వైఎస్సార్ సీపీ ఓటమి పాలై ఎన్డీఏ కూటమి అధికారంలో రావడంతో తన పనులు తాను చేసుకుంటూ జీవనం వెళ్లదీస్తున్నాడు. ఈ క్రమంలో టీడీపీకి చెందిన అమ్ములు, ఆలీ, షేక్ సైదాలు సయ్యద్ ఖాజాతో శనివారం సాయంత్రం గొడవపడ్డారు. ఈక్రమంలో రాత్రి సమయంలో తన ఇంటి ముందు నిలిపి ఉన్న కారు పై పెట్రోల్ పోసి దహనం చేసేందుకు యత్నించారని సయ్యద్ ఖాజా ఆరోపించారు. ఈ ఘటనపై సయ్యద్ ఖాజా భార్య సయ్యద్ షర్మిల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మృత్యువుతో పోరాటం.. ఆగిపోయిన ప్రాణం

- రోడ్డు ప్రమాదంలో యస్ బ్యాంక్ ఉద్యోగి దుర్మరణం
- 108 వాహనం సకాలంలో రాక మృత్యువు ఒడిలోకి..


మృతి చెందిన మొద్దు వెంకటేష్


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

ప్రత్తిపాడు: మృత్యువుతో సుమారు నలభై నిమిషాల పాటు పోరాడి చివరకు తుదిశ్వాస విడిచాడు ఓ వ్యక్తి. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లా, పెదనందిపాడు గ్రామానికి చెందిన మొద్దు వెంకటేష్ (31) ఉరఫ్ ఆనంద్ రెండు సంవత్సరాలుగా చెన్నైలోని యస్ బ్యాంకులో ఫారెన్ కరెన్సీ ఎక్స్‌చేంజ్ విభాగంలో పని చేస్తున్నారు. సెలవులకు రెండు రోజుల కిందట స్వగ్రామానికి వచ్చారు. శనివారం సాయంత్రం కారులో గుంటూరు వెళ్లి, పనులు ముగించుకుని అర్ధరాత్రి పన్నెండున్నర గంటల సమయంలో ఇంటికి బయల్దేరారు. ప్రత్తిపాడు సమీపంలోని మూలమలుపు వద్ద వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన వెంకటేష్ రక్తమోడుతూ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ఆదివారం మృతుని తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు తెలిపారు.

**గంటకు పైగా నరకయాతన**

బలమైన గాయాలతో ఘటన స్థలంలో పడిఉన్న వెంకటేష్ దాదాపుగా గంటకు పైగా మృత్యువుతో పోరాడాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు రాత్రి ఒంటి గంటకు 108కు ఫోన్ చేశారు. అయితే, యాభై నిమిషాల పాటు వాహనం అందుబాటులోకి రాలేదు. అలానే ఆఖరి శ్వాసను బలంగా పీల్చుతూ, రోదిస్తూ కొనఊపిరితో రోడ్డుపక్కన కొట్టుకుంటూ మృత్యువుతో వెంకటేష్ పోరాడాడు. 108 వాహనం రావడంలో తీవ్ర ఆలస్యం కావడంతో కన్నుమూశాడు. తీరా రాత్రి 1.50 గంటలకు వాహనం వచ్చింది. వెంకటేష్‌ను పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించి వెళ్లిపోయారు.

# డాక్టర్ సుమితా శంకర్‌కు రీసెర్చ్ అవార్డు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి, ప్రముఖ కాస్మోటిక్ సర్జన్ డాక్టర్ సుమితా శంకర్‌ను న్యూఢిల్లీలో ఆదివారం ప్రతిష్టాత్మక పయనీర్ రీసెర్చ్ బ్లాక్ బక్ అవార్డుతో సత్కరించారు. ఫైలేరియాసిస్ కేసులలో లింఫెడెమాను నిర్వహించడానికి వినూత్న పద్ధతులపై ఆమె చేసిన పరిశోధనకు ఈ అవార్డు లభించింది. న్యూ ఢిల్లీలో మెడికల్ డైలాగ్స్ నిర్వహించిన ఈ వేడుకకు కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా, జల్ శక్తి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీ రాజ్ భూషణ్ చౌదరి హాజరై అవార్డులు అందజేశారు. డాక్టర్ సుమితా శంకర్ హెల్త్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా పనిచేసిన సమయంలో 500 అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్ రీసెర్చ్ స్కాలర్‌షిప్‌లు, 25 ఫ్యాకల్టీ రీసెర్చ్ గ్రాంట్‌ల సహా ముఖ్యమైన విద్య, పరిశోధన కార్యక్రమాల్ని పర్యవేక్షించారు.

# సబ్జెక్ట్ టీచర్ల కొరతతో కుంటుపడుతున్న బోధన

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టు టీచర్ పోస్టుల్ని ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మొహమ్మద్ ఖాలీద్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్లస్ టూ పాఠశాలల్లో రెగ్యులర్ ప్రాతిపదికన టీచర్ పోస్టుల్ని మంజూరు చేయాలని కోరారు. డైట్ కళాశాలలో ఖాళీల్ని రెగ్యులర్ ప్రాతిపదికన అర్హత గల ప్రధానోపాధ్యాయులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో ఉపాధ్యాయుల కొరతతో బోధన ప్రమాణాలు కుంటుపడి, విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాచర్ల మండలం విజయపురిసౌత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 424 మంది విద్యార్థులకు 20 పోస్టులు మంజూరు కాగా, తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్ బోధిస్తున్న నలుగురు టీచర్లు మినహా మిగిలిన 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వెల్దుర్తి మండలంలో 80 మందికి పైగా ఉపాధ్యాయుల కొరత ఉందని తెలిపారు. గుంటూరు రూరల్ మండలంలోని ఉన్నత పాఠశాలల్లో పలువురు సీనియర్ ఉపాధ్యాయులు గత జనవరి నుంచి ఉద్యోగ విరమణ చేయడంతో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరద ఉందని పేర్కొన్నారు. సబ్జెక్టు టీచర్ల స్థానంలో ఎస్జీటీలతో తాత్కాలికంగా విద్యాబోధన కొనసాగుతోందని తెలిపారు. ఉపాధ్యాయుల కొరతపై నూతన ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి దృష్టి సారించడంతో పాటు ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు.